కాంగ్రెస్ సంబరాలు


ముస్తాబాద్: గొల్లపల్లిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


చందుర్తి: స్వీట్ తినిపించుకుంటున్న కార్యకర్తలు


రుద్రంగి: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వీర్నపల్లిలో..

గంభీరావుపేట/ముస్తాబాద్/వీర్నపల్లి/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/చందుర్తి/రుద్రంగి/బోయినపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సిరిసిల్ల నియోజకవర్గంలో, వేములవాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలవడంతో వేములవాడ నియోజకవర్గంలో, చొప్పదండి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం విజయం సాధించడంతో మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి డప్పు చప్పళ్ల మధ్య నృత్యాలు చేశారు.


వేములవాడఅర్బన్: నాంపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు


గంభీరావుపేట: విజయోత్సవ సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు


చందుర్తిలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

బీఆర్ఎస్ సంబరాలు


ముస్తాబాద్: కేటీఆర్ భారీ మెజార్టీతో విజయం సాధించడంపై ముస్తాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. 30 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో కేటీఆర్‌ను గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. కేటీఆర్‌కు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సతీశ్‌చందర్‌రావు, కొండ శ్రీనివాస్, కంచం నర్సింలు, సావిత్రి, దేవేందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన ఎన్నికల ఆదాయం


వేములవాడ ఆర్టీసీ బస్టాండ్

వేములవాడఅర్బన్: అసెంబ్లీ ఎన్నికలు ఆర్టీసీకి కలిసి వచ్చాయి. ఈ నెల 1 నుంచి 29 వరకు ఎన్నికల ప్రచారం జరిగి ఈ నెల 30న ఎన్నికల పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి ఆర్టీసీ బస్సులను ప్రచారాల కోసం వివిధ ప్రాంతాలకు ప్రజలను చేరవేసేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. దాంతో ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల ఆదాయం రూ.69 లక్షలు

వేములవాడ ఆర్టీసీ డిపో బస్సులను ఈనెల 1 నుంచి 29 వరకు ప్రచారం కోసం ప్రజలను చేరవేసేందుకు బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపించారు. ఈ నెల 1 నుంచి 29 వరకు 250 బస్సులు 81,186 కిలోమీటర్లు తిరిగాయి. ఆదాయం రూ.60 లక్షలు సమకూరినట్లు తెలిపారు. అలాగే ఈనెల 30న ఎన్నికల పోలింగ్ రోజు 11,350 కిలోమీటర్లు తిరుగగా రూ.9 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఎన్నికలకు మొత్తం రూ.69 లక్షలు వచ్చినట్లు తెలిపారు. అలాగే రోజు వారి ప్రయాణికులకు నడిచే బస్సులు కాకుండా అదనంగా ఎన్నికల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

సమష్టి కృషితో ఆదాయం



వేములవాడ ఆర్టీసీకి రోజు వారి బస్సులను యధావిధిగా తిరుగుతునే, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అదనంగా బస్సులను ఎన్నికలకు ఏర్పాటు చేశాం. దీంతో ఆర్టీసీకి అదనంగా ఆదాయం సమకూరింది. దీనికి ఆర్టీసీ ఉద్యోగుల సమష్టి కృషి కారణం.

– మురళీకృష్ణ, డిపో మేనేజర్, వేములవాడ

మనబడి పనుల్లో నిర్లక్ష్యం

- అందని బిల్లులు
- పునాదులు దాటని పనులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు


గడ్డి పెరుగుతున్న తరగతిగది పునాదులు

కోనరావుపేట: పాఠశాలల అభివృద్ధి కోసం అన్ని రకాల పనులు చేస్తున్నామని చెప్పుకుంటున్నా చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు సాగడం లేదు. ఫలితంగా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాలకు మన ఊరు మన బడిలో రూ.29.35 లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.34.77 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో అదనపు తరగతి, డైనింగ్ హాల్, విద్యుత్ పనులు, ప్లంబింగ్ పనులు, నీటి ట్యాంక్ ఏర్పాటు చేసి తరగతి గదుల పైకప్పు మరమ్మతు చేపట్టాలి. వీటిలో తరగతి గదుల పైకప్పు మరమ్మతు పనులు పూర్తయ్యాయి. విద్యుత్, ప్లంబింగ్ పనులు చేశారు. తరగతి గది కోసం పనులు మొదలుపెట్టి నెలలు గడుస్తున్నా ముందుకు సాగడంలేదు. డైనింగ్ హాల్ మొదలుపెట్టి వదిలేయడంతో గడ్డి పెరుగుతోంది. అయితే ఇప్పటివరకు చేసిన పనులకు కూడా బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులను వదిలేశారు. ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేసి పనులు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

దళారుల చేతుల్లో తెల్ల బంగారం

- విచ్చలవిడిగా గ్రామాల్లో కొనుగోళ్లు
- పట్టించుకోని మార్కెట్ శాఖ అధికారులు
- చేతులెత్తేసిన సీసీఐ అధికారులు..?

వేములవాడరూరల్: మార్కెట్ పరిధిలో ప్రైవేట్ వ్యాపారులు ఎలాంటి కొనుగోళ్లు చేయకుండా నిరోధించాల్సిన మార్కెట్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా రైతుల నుంచి కొనుగోళ్లు జరుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఎలాంటి లైసెన్స్ లేకుండా కొనుగోలు చేయలేదనే మార్కెట్ ఆదేశాలను తుంగలో తొక్కి కొంతమంది చోటామోటా వ్యాపారులు కూడా బహిరంగంగా గ్రామాల్లో వడ్లు, పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి తనిఖీలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మార్కెట్ పరిధిలో కొనుగోలు చేస్తున్న విషయం తెలిసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లను ప్రారంభించినప్పటికీ రైతులకు అవగాహన లేకపోవడంతో అక్కడికి తరలించకుండా గ్రామాలకు వచ్చే ప్రైవేటు వ్యాపారులకే తప్పని పరిస్థితుల్లో విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నట్లు గ్రామాల్లో ఆరోపణలు వస్తున్నాయి. వేములవాడ రూరల్ మండలంలో ప్రధానంగా ఈ సంవత్సరం రైతులు పత్తి పంటతో పాటు ధాన్యాన్ని కూడా సాగు చేసుకున్నారు. ధాన్యం పంటను వేములవాడ సొసైటీ శాఖ తరుపున కొనుగోలు చేస్తుండగా పత్తి పంటను సీసీఐ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. వేములవాడ అర్బన్, రూరల్ మండలాల్లో ఉన్న రుద్రవరం, నాంపల్లి, సుద్దాల ప్రాంతాల్లో సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయగా రైతులు ఆ ప్రాంతానికి తరలించకుండా ఇంటి వద్దకు వచ్చే ప్రైవేటు రైతులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దూరభారంతో పాటు వాహన చార్జీలు కూడా అదనపు భారంతో ప్రైవేటు వ్యాపారులకు తప్పని పరిస్థితుల్లో పత్తి వ్యాపారులు విక్రయించుకుంటున్నారు.


రోడ్డుపైనే పత్తిని కొనుగోలు చేస్తున్న దళారి

ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ

ప్రభుత్వం ఈ సంవత్సరం ధాన్యం సాధారణ రకం రూ.2,133, గ్రేడ్ రకం రూ.2,203 క్వింటాల్‌కు ఉండగా, పత్తి సాధారణ రకం రూ.6,620 ఉండగా, పొడుగు రకం గింజతో రూ.7,020 ప్రస్తుతం ఉంది. కానీ ఈ విషయాన్ని మార్కెట్ శాఖ అధికారులు ప్రచారం చేయకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర తెలియక ప్రైవేటు వ్యాపారులకు రూ.6,500కే విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా మార్కెట్ శాఖ అధికారులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి ప్రైవేటు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లపైనే కొనుగోళ్లు

వేములవాడ మండలంలో కొంతమంది ప్రైవేటు వ్యాపారులు ఎలాంటి లైసెన్స్ లేకుండానే పత్తి వ్యాపారాన్ని చేస్తున్నట్లు తెలిసింది. మార్కెట్ శాఖ నుంచి ప్రభుత్వ ఫీజు చెల్లించి నిబంధనల ప్రకారం అనుమతులు ఉంటేనే రైతుల నుంచి సరుకులు కొనుగోలు చేయాలి. కానీ వేములవాడ మండలంలో చాలామంది వ్యాపారులు లైసెన్స్ లేకుండానే కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలిసింది. అడపా దడపా తనిఖీలు చేస్తున్న అధికారులు ఇప్పటివరకు ఎవరిపై మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

దళారులకు చెక్



వేములవాడ మండలంలో సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేస్తున్నారు. పత్తిని విక్రయించే రైతులు నేరుగా సీసీఐ కేంద్రాలకే తరలించాలి. రైతులు స్వయంగా వెళ్లి వేలిముద్ర వేస్తేనే ఓటీపీ వస్తుంది. అప్పుడే పత్తిని రైతుల వద్ద నుంచి సీసీఐ అధికారులు కొనుగోలు చేస్తారు.

– సత్యనారాయణ, ఏఎంసీ సెక్రెటరీ, వేములవాడ

కొనుగోళ్లు జరుగుతున్నాయి

వేములవాడ సీసీఐ శాఖ తరుపున ఇప్పటి వరకు 516 మంది రైతుల నుంచి 11,637 క్వింటాళ్లను కొనుగోలు చేయడం జరిగింది. రైతులకు సీసీఐలో విక్రయాలు చేయాలని మా శాఖతో పాటు మార్కెట్ శాఖ తరుపున అవగాహన కూడా కల్పిస్తున్నాం. అయినప్పటికీ కొంతమంది రైతులు గ్రామాల్లో ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

– రఘురాం, సీసీఐ సీనియర్ కమర్షియల్ అధికారి

శ్రీకాంతాచారికి కొవ్వొత్తులతో నివాళి


నివాళి అర్పిస్తున్న స్వర్ణకారులు

గంభీరావుపేట: తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారికి గంభీరావుపేట మండల కేంద్రంలో స్వర్ణకార సంఘం నాయకులు ఆదివారం కొవ్వొత్తులతో నివాళి అర్పించి ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. సంఘం అధ్యక్షుడు రాజారాం, ఉపాధ్యక్షుడు రాజేష్‌చారి, నాయకులు శ్రీనివాస్, కృష్ణప్రసాద్, నాగరాజు, భాస్కర్, నరేష్, రాధాక్రిష్ణ, నరేందర్, నరేశ్ పాల్గొన్నారు.

చిత్రకథ



మరమ్మతు చేపట్టరూ !

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామ ఉన్నత పాఠశాల ముందు రహదారిపై తవ్వి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరిమడ్ల నుంచి నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్ తదితర ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి. ఈ దారిగుండా రోజూ బస్సులు, ఇతర వాహనాలు అధికసంఖ్యలో వెళ్తుంటాయి. పాఠశాల వద్ద తవ్విన రోడ్డును పూడ్చకపోవడంతో వాహనదారులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.



వారసంత.. సమస్యల చింత

కోనరావుపేట: మండల కేంద్రంలో పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి గురువారం నిర్వహిస్తున్న వారసంత అసౌకర్యాలకు నిలయంగా మారింది. పదేళ్ల నుంచి జరుగుతున్న ఈ సంతకు కోనరావుపేటతోపాటు ఎగ్లాస్‌పూర్, శివంగాలపల్లి గ్రామాల వారు కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తారు. అంగడిలో సరైన వసతులు లేక విక్రయించే వారు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే సామగ్రి మొత్తం తడిసిపోతున్నది. అలాగే అంగడి ప్రధాన రహదారిపై నిర్వహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు సమస్యలు ఏర్పడుతున్నాయి. పంచాయతీ పాలకులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.



పంటకు రక్షణగా పాత చీరలు

వీర్నపల్లి: మండలం భూక్య తండా పరిధిలోని రాశిగుట్ట తండాకు చెందిన గిరిజనులు అడవికి దగ్గరలో ఉన్న పంట చేలను కాపాడుకోవడానికి అడవి పందులు, కోతుల ఇతర జంతువుల నుంచి పంటను రక్షించుకోవడానికి ఇలా పాతచీరలను ఉపయోగిస్తున్నారు. దాదాపు 200 మీటర్ల వరకు పాత చీరలతో పంటకు రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశారు.

వికలాంగుల ర్యాలీ

కోనరావుపేట: మండల కేంద్రంలో వికలాంగుల దినోత్సవం సందర్భంగా ర్యాలీలు తీశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం మండలాధ్యక్షుడు పల్లం లింగయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు వికలాంగులకు 7 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, సిర్ర నర్సయ్య, రాపెల్లి గణేశ్, లింగంపెల్లి నర్సయ్య, ఏరెడ్డి వేణు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కనగర్తిలో..

కోనరావుపేట మండలం కనగర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాపురెడ్డి, వికలాంగుల సంఘం నాయకులు మద్దూరి చంద్రారెడ్డి, రావులపెల్లి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కనగర్తిలో ర్యాలీ తీస్తున్న వికలాంగులు

పాఠశాలల్లో తాగునీటికి కటకట

కోనరావుపేట: మండలంలోని ధర్మారం, కనగర్తి పాఠశాలల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలోని మినీ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. కనగర్తి ప్రాథమిక పాఠశాలలో ఉన్న చేతిపంపు శిథిలమవుతోంది. దీంతో ఆయా గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు నీటి కోసం అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల్లో తాగు నీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


కనగర్తి పాఠశాలలో పనికిరాని చేతిపంపు